నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. త్రిశూల్ మెట్రో, సిటిజన్ కాంటా, కాటేదాన్, గంగోత్రి, మెట్రో మాల్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్వీసింగ్ గల్లీ ఏరియా, టీఎన్‌జీవోస్ కాలనీ, అమ్మగార్డెన్, మార్కెట్ ఏరియా, రవిపుడ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

గోల్డ్ డ్రాప్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రవిపుడ్ ఇండస్ట్రియల్ ఏరియా, రామ్‌చరణ్ ఆయిల్ మిల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆపివేస్తామన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

అత్తాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. శనివారం ఖయాంనగర్‌లో సీసీ రోడ్డు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్, నేతలు వెంకట్‌రెడ్డి, విజయ్, స్వామి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న గోకరి సురేష్‌గౌడ్

బండ్లగూడ: సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారుతుందని.. సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌కు చెందిన కె.అమృతకు సీఎం సహాయ నిధి నుంచి రూ. 82 వేలకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలు దరఖాస్తులు చేసుకున్న వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా చేయూతనందిస్తున్నామన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని నూతన హనుమాన్ దేవాలయ అభివృద్ధి పనులను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు గుడి నిర్మాణానికి తనవంతు సహకారాలు అందిస్తానని తెలిపారు. నేతలు బుచ్చిరెడ్డి, గోవింద్‌రాజ్, విజయ్‌కుమార్, కిషోర్, వెంకటేష్, ఉత్తం, ఉదయ్, చిన్న, శివాజీ, వల్లభ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

రాజేంద్రనగర్: ప్రజా పాదుపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన మెగా ఉచిత వైద్య శిబిరం, ప్రాథమిక లైఫ్ సపోర్ట్స్ స్కిల్స్ సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి జనతా హృదయాలయ ఫౌండేషన్, కేర్ హాస్పిటల్ హృదయ సంబంధిత నిపుణులు డాక్టర్ మల్‌రెడ్డి హనుమంత్ రెడ్డి, చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ ఎం.మోదినీరెడ్డిల వైద్య బృందం పాల్గొని వివిధ 25 రకాల టెస్టులు, ఈసీజీ, టుడీ ఎకో, కార్డియోగ్రామ్ టెస్టులు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, ప్రజా పాదుపు సంఘం అధ్యక్షుడు మల్లెల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు పి.మధుసూదన్, కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, కోశాధికారి వెంకట్ రెడ్డి, వర్గ సభ్యులు జి.జగన్‌మోహన్‌రెడ్డి, కె.హరికిషన్‌జీ, మహేశ్ రెడ్డి, సదాల పడమటి సుభాష్ చంద్ర పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన... భోజనాన్ని అందించాలి

- ఆహార పదార్థాలు కలుషితం కావద్దు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- ఉత్తమ ఫలితాలను సాధించాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



బోధనపై విద్యార్థినుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న కలెక్టర్



అన్నాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మణికొండ: గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. నార్సింగిలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలను ఆయన శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులను అడిగి పాఠశాల వివరాలను తెలుసుకున్నారు.

◆ విద్యార్థినుల కోసం వండిన ఆహారం, పాఠశాల, డైనింగ్ హాల్, వంటశాల, స్టోర్ రూమ్‌లలో నిలువ ఉంచిన సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థినులకు స్వచ్ఛమైన, రుచికర, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బంది, అధికారులను ఆదేశించారు. ఆహారాన్ని వండే సిబ్బంది పరిశుభ్రంగా ఉండాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

◆ విద్యార్థినులను మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. పాఠశాలలో ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువులోని ప్రతి సబ్జెక్టుపై ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేసేలా విద్యాబోధన చేయాలన్నారు.

◆ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేసి పునఃశ్చరణ తరగులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టులలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిచాలన్నారు. పదవ తరగతిలో వంద శాతం అత్యుత్తమ గ్రేడ్లతో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

◆ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, మండల విద్యాధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాతే రేషన్ కార్డులు

రాజేంద్రనగర్ ఏఎస్ఓ పుల్లయ్య



పుల్లయ్య

అత్తాపూర్: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు వేచి ఉండాలని రాజేంద్రనగర్ అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ పుల్లయ్య పేర్కొన్నారు. నూతనంగా రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే వారు మీ సేవ ద్వారా చేసుకోవాలని ప్రభుత్వం సూచించిందన్నారు. అనివార్య కారణాల వల్ల మీసేవ ద్వారా రేషన్ కార్డులను కోసం నిలిపి వేసిందన్నారు. నూతనంగా రేషన్ కార్డు కోసం దరఖాస్తుదారులు దరఖాస్తు చేసేందుకు మీ సేవలో సంబంధిత వ్యక్తులను ఆరా తీస్తే దరఖాస్తుల స్వీకరణ ప్రభుత్వం నిలిపివేసిందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దరఖాస్తులు చేసుకునేందుకు వెళ్లిన రేషన్ కార్డుల కోసం వినియోగదారులు మీసేవ సెంటర్ల వద్ద వేచి చూశారు. విషయం తెలుసుకున్న మీ సేవ నిర్వాహకులు ప్రభుత్వం తీసుకున్న ఆదేశాల మేరకు రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరించడం లేదని ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంత వరకు వెయిట్ చేయాలన్నారు. ప్రభుత్వ సూచనను అనుసరించి మీసేవ సెంటర్ల ద్వారా రేషన్ కార్డు దరఖాస్తుదారులకు తెలియజేస్తామని అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

'ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరివ్వండి'



జలమండలి అధికారికి వినతిపత్రం ఇస్తున్న మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్

బండ్లగూడ: ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులను నీటిని సరఫరా చేసి వినియోగంలోకి తీసుకురావాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆయా రిజర్వాయర్లు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా ప్రజలకు తాగు నీరు అందకపోవడం దారుణమన్నారు. తక్షణమే వాటికి నీటిని సరఫరా చేసి ప్రజలకు తాగునీటి కష్టాల నుంచి విముక్తి కల్పించాలన్నారు. ఈ మేరకు జలమండలి అధికారులకు శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న తాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు. రెండు రిజర్వాయర్లు శంకుస్థాపన చేసి సంవత్సరాలు గడుస్తున్నా వాటిలో ఇప్పటి వరకు చుక్క మంచినీరు రాలేదన్నారు. పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి పలు వినతి పత్రాలు ఇచ్చినా ఇదిగో వస్తున్నాయి, అదిగో వస్తున్నాయి అని కాలపయాపన చేస్తున్నారని ఆరోపించారు. తాగునీటిని సరఫరా చేయడంలో వాటర్ బోర్డు అధికారులు విఫలం అయ్యారని ఆయన ధ్వజమెత్తారు. వెంకటేశ్వర నగర్, విద్యానగర్ ఫేజ్-2 శివ సాయినగర్, డీఎంఆర్ విష్ణుపురి కాలనీ, వాల్మీకి నగర్, దత్తాత్రేయ నగర్, రంగారెడ్డినగర్, సుబ్రహ్మణ్య ఫేజ్-4, ఇందిరమ్మ కాలనీ పలు కాలనీలలో తాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటర్ బోర్డు ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి త్వరలో తాగునీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



హైదర్‌గూడ చౌరస్తాలో సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

అత్తాపూర్: దేశాభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. 27 ఏళ్ల తరువాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకున్న సందర్భంగా పార్టీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో హైదర్‌గూడ చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా మల్లారెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీతగౌరి, కొమురయ్య, మల్లేష్‌యాదవ్ హాజరయ్యారు. నేతలు కాడెం సుధాకర్, రాజశేఖర్, జయానంద్‌రెడ్డి, విజయ్‌కుమార్, కిరణ్‌చారి పాల్గొన్నారు.

మణికొండలో...

మణికొండ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ విజయం సాధించటంతో ఆ పార్టీ నాయకులు మణికొండలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంతో పాటు రాష్ట్రాలు కూడా బీజేపీ పాలనలోనే అవినీతి రహితంగా అభివృద్ధి చెందుతాయని ప్రజలు భావిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగానే దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ పాలన ఉందని, వాటికి తోడు ఢిల్లీ చేరిందన్నారు. రాబోయే తెలంగాణ ఎన్నికల్లో గెలుపొందటమే టార్గెట్‌గా ఇప్పటి నుంచి పార్టీ పనిచేస్తుందన్నారు. రాష్ట్ర నాయకులు సుధాకర్, నాయకులు బీరప్ప, సిద్ధప్ప, రాజశేఖర్, ఇందిర, అనిత, వందన, లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, హంసరాజు, వినోద్, ప్రసాద్, కాశీ, వెంకట్‌రెడ్డి, సతీష్, టీనా తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో...

మైలార్‌దేవ్‌పల్లి: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎనలేని కృషి చేస్తున్నారని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్ అధ్యక్షతన విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయం ఆవరణలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకొన్నారు. పార్టీ నాయకులు జోగి రవి, సంతుగౌడ్,



మణికొండలో బీజేపీ నాయకులు...



రాజేంద్రనగర్‌లో...

బబ్లూ, టి.చిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, పాండుయాదవ్, వి.లక్ష్మీ, భూపతిరెడ్డి, శంకర్, గోవర్ధన్‌రెడ్డి, అంజమ్మ, జయంతి, పూజనందిని, షకీల్, రామరావు, శేఖర్, పి.నందు, చింటూ, మజార్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో విజయోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యువమోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి, మక్తల్ ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఢిల్లీ ప్రజలు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంపై నమ్మకంతో కేజ్రీ వాల్ చేసిన అవినీతి పాలనకు స్వస్తి పలికారన్నారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ ముదిరాజ్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు గోనె శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.విట్టల్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు మల్లేష్ చారి, ఎస్టీ మోర్చా డివిజన్ అధ్యక్షులు ప్రకాశ్ నాయక్, పవన్, స్వప్న రెడ్డి, వెంకటేశ్, హర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాటేదాన్‌లో తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



డిజిటల్ క్లాస్‌లు ప్రారంభిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. పద్మశాలీపురానికి చెందిన భవాని కేబుల్ అండ్ ఇంటర్నెట్ యజమాని రాముయాదవ్ నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ క్లాస్ నిర్వహణకు ఉచిత ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయన సేవా భావాన్ని కొనియాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ప్రశంసించారు. నవయువ యూత్ క్లబ్ తరఫున అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సహాయ కార్యదిర్శ కొంపల్లి జగదీష్, కిషోర్‌రెడ్డిలు రాముయాదవ్‌ను అభినందించారు. సమాజానికి ఇలాంటి సేవల ద్వారా మేలు కలిగించాలని ఆకాంక్షించారు. మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో యువత ముందుకు వస్తే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధ్యాయులు మహేశ్వర్, లక్ష్మి, మమత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ చూపాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ఉరుకుల పరుగుల జీవన విధానంలో నగర ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుద్వేల్ వెంకటేశ్వర కాలనీలోని విశ్వశాంతి గ్రామర్ స్కూల్‌లో శనివారం మైలార్‌దేవ్‌పల్లి మావి హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ శ్రీకాంత్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... క్రమశిక్షణతో కూడిన వ్యాయామంతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.కరుణాకర్, స్థానిక నాయకులు కె.శ్రీకాంత్ రెడ్డి, జంగం రవి, మహేశ్ గౌడ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'జీసస్' స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- పాఠశాల ఎదుట రెండో రోజూ కొనసాగిన ఆందోళన
- చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం తగదని ఆగ్రహం



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థి, ప్రజాసంఘాల నేతలు

శంషాబాద్: ఒకటో తరగతి బాలికపట్ల బస్సు డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై శనివారం కూడా పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాల ఎదుట ప్రజాసంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. సంఘటనకు స్కూల్ యాజమాన్యం, సంబంధిత టీచర్లు కూడా కారణమేనని వారిపై కూడా కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల వైఖరి కారణంగా ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలలో ఇలాంటి సంఘటన చోటు చేసుకుందన్నారు. గతంలో కూడా పాఠశాల యాజమాన్యంపై జిల్లా విద్యాధికారి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. చిన్నారులను పాఠశాలకు పంపాలంటేనే భయం వేస్తుందని పలువురు తల్లిదండ్రులు కూడా ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

నిందితులపై చర్యలు తథ్యం...

పాఠశాలకు సంబంధించిన యాజమాన్యంపై ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించామని ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపారు. కేసు మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండటంతో బాధితుల ఫిర్యాదును అక్కడికి పంపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిందితుడు మంచాల పోలీసుల అదుపులో ఉన్నట్లు చెప్పారు. నిందితులు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అర్హతలేని సభ్యుల తొలగింపు

నార్సింగి పీఏసీఎస్ తీర్మానం



మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణ

మణికొండ: వ్యవసాయ భూమి, పట్టా పాస్ పుస్తకాలు లేకుండా ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్)లో సభ్యులుగా కొనసాగుతున్న వారిని తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. నార్సింగి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం ఖానాపూర్‌లోని కార్యాలయంలో చైర్మన్ తోలుకట్ట కృష్ణ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజమైన రైతులకు వీలైనన్ని ప్రయోజనాలు కలిగించాలని, అదే రైతులు కాని వారిని సంఘంలో ఉంచుకోవటంలో అర్థం లేదన్నారు. అర్హత లేని 40 మంది సభ్యులను తొలగించేందుకు ప్రతిపాదన పెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. సంఘం సభ్యులకు పంట రుణాలతో పాటు మార్టిగేజ్, గోల్డ్, ఎడ్యుకేషన్ లోనులు ఇవ్వాలని తీర్మాణం చేశారు. అర్హత ఉండి సభ్యతం లేని వారికి కొత్తగా సభ్యత్వం ఇవ్వాలని సభ్యులంతా ఆమోదించారు. తమ సంఘానికి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, వడ్డె రమేష్, మన్నె మల్లేష్, మాజీ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్.నర్సింహా, రైతులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగికదాడి.. ఆపై బెదిరింపు...

- పార్కులో అడుకుంటున్న బాలికపై దురాగతం
- డబ్బులు, నగలు తీసుకొని పలుమార్లు లైంగికదాడి
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో ఓ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటనలో సంచలన విషయంలు వెలుగులోకి వస్తున్నాయి. వివరాలివీ... రాజస్థాన్‌కు చెందిన ఓ కుటుంబం ఉద్యోగ రీత్యా హైదర్‌షాకోట్‌లో వచ్చి స్థిరపడింది. 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక సమీపంలోని పార్కులో ఆడుకుంటుండగా అక్టోబర్ 20వ తేదీన అదే ప్రాంతంలో నివాసం ఉండే మధుసూదన్, జయంత్, సాయి, తరుణ్‌కుమార్‌లు ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్యంగా ఉండే స్నిహితహిల్స్ గుట్టలలోకి తీసుకెళ్లారు. అక్కడ ఒకరి తరువాత మరొకరు అత్యాచారానికి పాల్పడ్డారు. రాత్రి 10 గంటల సమయంలో పార్కు వద్ద బాలికను వదలి వెళ్లిపోయారు. మరుసటిరోజు తరుణ్‌కుమార్ మరో స్నేహితునితో కలిసి బలవంతంగా ఈఎన్‌టీ కాలనీకి తీసుకుని వెళ్లి అక్కడ అత్యాచారం చేశారు. ఈ విషయం ఎవరికి చెప్పినా చంపేస్తామని బెదిరించి ఇంటి వద్ద వదిలిపోయారు. మరో రెండు రోజుల తరువాత సాయి అనే యువకుడు తన గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు.

బంగారం, డబ్బు డిమాండ్...

బాలికపై వరుసగా రెండు రోజులు అత్యాచారానికి పాల్పడటంతో పాటు ఇంట్లోనుంచి డబ్బు, బంగారం తెచ్చి ఇవ్వాలని నిందితులు డిమాండ్ చేశారు. మొదటి రోజు అత్యాచారం చేసిన రోజే బాలిక చెవులకు ఉన్న కమ్మలను లాక్కున్నారు. ఆ తరువాత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేయటంతో తండ్రి బ్యాగ్‌లో ఉన్న రూ. 10 వేలను తీసుకెళ్లి ఇచ్చింది. మరో సారి నలుగురు కలిసి బాలికను బయపెట్టడం, బ్లాక్‌మెయిల్ చేసి ఇంట్లో ఉన్న బంగారం తెచ్చి ఇవ్వాలని బెదిరించారు. వారి బెదిరింపులు తట్టుకోలేక తల్లి బంగారు చైన్‌ను ఇంట్లో నుంచి దొంగలించి యువకులకు ఇచ్చేందుకు ప్రయతించింది. గత కొన్ని రోజులుగా బాలిక మూడీగా ఉంటుండటంతో తల్లి నిలదీసింది. జరిగిన విషయం అంతా చెప్పటంతో బాలిక తండ్రి మూడు రోజుల క్రితం నార్సింగి పోలీసుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే నలుగురు నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసులో మరి మంది భాగస్వామ్యం ఉందనే సమాచారంతో లోతుగా పరిశోధన చేస్తున్నారు.